
# కరుణించిన కనకదుర్గ

**బెజవాడ కనకదుర్గమ్మ కొండపై నుంచి నడుచుకుంటూ కిందికి వస్తున్నాను. మెడలో కెమెరా బరువుగా వేలాడుతోంది. మనసులో నారాయణ మంత్రం మార్మోగుతోంది.**



సువర్ణ కుమార్

ఆఫీసు బాయ్ నారాయణ అమ్మవారి గుడిలో పూజారయ్యాడు. అది జరగరాని విడ్డూరమేమీ కాదు కానీ, ఎందుకనో ఆ పరిణామం ఒక పట్టాన నాకు జీర్ణం కాలేదు. ఆఫీసు బాయ్ నారాయణకు, ఇప్పటి అతని పూజారి అవతారానికి మధ్య పైకి కనిపించే దూరమే కానీ; నిజానికి పిసరంత కూడా తేడా లేదు. నారాయణ ఎప్పటిలాగే ఉన్నాడు. కొత్త పాత్రలో పూర్తిగా లీనమైపోయి నటించేస్తున్నప్పటికీ నా దగ్గర మాత్రం తన సహజ స్వభావాన్ని దాచడానికి ప్రయత్నించలేదు. చూపుల్లో అదే చురుకుదనం, మాటల్లో అదే చమత్కారం, ఆప్యాయత. బతుకు దెరువు సూత్రాన్ని బాగా ఒంటబట్టించుకున్నాడు నారాయణ.

** ** **

రాష్ట్రంలోని రొయ్యల చెరువుల వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని అమ్ముకుని బతికే ఓ చిన్న పత్రికా కార్యాలయం అది. బెజవాడ ప్రజలు పోలీసు పరిభాషలో వన్ టౌన్ అని ఎంతో ముద్దుగా పిలుచుకునే పాత బస్తీ ప్రాంతంలోని ఓ ఇరుకైన సందులో మేడ మీద గది దాని చిరునామా. అక్కడకు దాదాపు పది కిలో మీటర్ల దూరంలో వుండే మంగళగిరి నుంచి ప్రతి రోజూ ఉదయాన్నే తన డొక్కు సైకిల్‌ను ఈడ్చుకుంటూ నారాయణ ఆఫీసుకొచ్చేవాడు. ముందుగా పత్రిక యజమాని, ఎడిటర్ కూడా అయిన జిలానీ ఇంటికి వెళ్ళి హాజరు వేయించుకుని ఆఫీసు తాళాలు, ఫైళ్లు పట్టుకొచ్చేవాడు. ఆఫీసు గదులన్నీ ఊడ్చడం, టేబుళ్ళపై దుమ్ము దులపడం, మంచినీళ్ళ కుండ నింపడం వంటి పనులతో అతని ఉద్యోగ ధర్మం మొదలయ్యేది.

ఆఫీసు కాలకృత్యాలు పూర్తయ్యాక నారాయణ రోడ్డుపైకి వెళ్ళేవాడు. తోపుడు బళ్ళపై అమ్మే ఇడ్లీలో, అట్లో తిని టీ తాగాక సిగరెట్ వెలిగించేవాడు. పది గంటలయ్యేసరికి రిపోర్టర్లు, సేల్స్ ప్రమోటర్లు, టైపిస్టు ఒక్కొక్కరే ఆఫీసుకొచ్చేవారు. ఆర్టిస్టు అవతారంలో నేను ఆ మందలో కలిసేవాడిని. నారాయణ తన పదునైన చమత్కార శైలిలో అందరినీ పలుకరిస్తూ ఎవరెవరు ఏయే పనులు చేయాలో జిలానీ నుంచి మోసుకొచ్చిన ఆదేశాలను పంపిణీ చేసేవాడు. ఏ పదకొండుకో, పన్నెండింటికో జిలానీ ఆఫీసులో అడుగుపెట్టడంతో నారాయణ మరీ బిజీ అయిపోయేవాడు. టీలు, సిగరెట్లు, బజ్జీలు, బిర్యానీలు తీసుకురావడం దగ్గరనుంచి పత్రిక కాపీలను పోస్టు చేయడం వరకు అన్ని పనులు నారాయణ చేతుల మీదగానే జరగాలి.

ఇన్ని పనులు చేసే నారాయణ ఆఫీసులో మిగతా వాళ్ళను పని చేసుకోకుండా చెడగొడుతుంటాడని జిలానీకి కోపం. ఇందులో నిజం లేదు కానీ, యజమానికి ఆగ్రహం కలిగించే లక్షణాలు మాత్రం నారాయణ దగ్గర పుష్కలంగా వున్నాయి. ఆఫీసులో వున్నంత సేపూ నారాయణ నోరు ఊరుకునేదికాదు. ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంటాడు. మధ్య మధ్యలో జిలానీ బాస్‌ను అనుకరిస్తూ జోకులు పేల్చేస్తూ వుంటాడు. లోకం పోకడ మీద లెక్చర్లు దంచేస్తూ వుంటాడు. నారాయణ చెప్పే బూతు జోకుల కోసం, స్కాండల్స్ కోసం మిగిలిన వాళ్ళు అతన్ని మరింత రెచ్చగొట్టే వాళ్ళు. ఒకసారి నారాయణ తనను అనుకరించడాన్ని జిలానీ స్వయంగా చూసాడు. ఆగ్రహం పట్టలేక ఉద్యోగం లోంచి తీసేస్తానంటూ గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు. నారాయణ ఇటువంటి బెదిరింపులు లక్ష్యపెట్టే రకం కాదు. "బోడి ఐదు వందల ఉద్యోగం వీడు కాకపోతే మరొకడు ఇస్తాడు" అంటూ దులిపేసుకున్నాడు. నారాయణలాగా గొడ్డు చాకిరీ చేసే మరొకడు దొరుకుతాడన్న భరోసా లేక జిలానీ కూడా ఆవేశం చల్లారాక ఇవేమీ పట్టించుకునేవాడు కాదు.

క్యాబిన్‌లో జిలానీ అండ్ కంపెనీ బిర్యానీ పొట్లాలు విప్పే సమయానికి బయట నారాయణ తన రెండు గిన్నెల చద్దిమూట తెరిచేవాడు. ఒక గిన్నెలో పప్పో, పచ్చడో కలిపిన అన్నం, మరో దాంట్లో పెరుగన్నం తెచ్చేవాడు. ఓ రోజు నా టిఫిన్ బాక్సులోని కోడిగుడ్డును రెండు ముక్కలు చేసి తీసుకోమంటే, "బ్రామ్మలం సార్, అలవాటు లేదు" అన్నాడు. మరొక రోజు బలవంతాన తన పెరుగన్నం నాకు సగం వడ్డించాడు. అందులో అన్నంతో పాటు ఉడికిపోయిన తెల్లని బియ్యం పురుగులు తెట్టులా పైన తేలాడుతున్నాయి. తినడానికి మనసొప్పక కాస్త ఇబ్బంది పడుతూనే ఆ విషయం బయటకు చెప్పాను. "మరీ ఇలా వుంటే ఎలా తింటున్నావయ్యా?" అంటే, "అవన్నీ చూసుకుంటూ తినాలంటే కడుపు నిండదు సార్. లాగించేయండి" అంటూ తన గుబురు గడ్డంలోనుంచి నా వైపు కొంటెగా చూసి నవ్వాడు. ఆ చూపులో ఏదో చురుకుదనం తగిలి నేను సిగ్గుతో తలదించుకున్నాను.

నారాయణ పదో తరగతి ఫెయిలయ్యాడు. కానీ, అతని వాలకం చూస్తే ఎవరూ అలా అనుకోరు. ఇంగ్లీషు మాట్లాడడం చేతనైతే లోకాన్ని దున్నేసేవాడినని తన మాటకారితనానికి తానే మురిసిపోయేవాడు నారాయణ. "సోప్ థియరీ" అంటూ ప్రైవేటు సంస్థల్లో యాజమాన్యాలు ఎలా వ్యవహరిస్తుంటాయో చాలా ఆసక్తికరంగా వర్ణించి చెప్పేవాడు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులంతా సబ్బులాంటి వాళ్ళని, యజమానులు తమ అవసరాల కోసం వాళ్ళని అరగదీసి కరిగిపోయేదాకా వాడుకుంటారని అనేవాడు. ఆఫీసులో ఒక్కొక్కరికి ఒక్కో సబ్బు పేరు పెట్టి వాళ్ళ అరుగుదల శాతాల గురించి లెక్కలు వేసి మరీ హడలుగొట్టేవాడు.

"ఆర్టిస్టు గారూ నేను అర్జంటుగా కుక్కనైపోతానండీ" అన్నాడు నారాయణ ఓ రోజు నా దగ్గరకొచ్చి. జిలానీ ఇంట్లో దెయ్యాల్లా వుండే రెండు కుక్కలుండేవి. వాటికి రోజూ రెండు కిలోల మాంసం పెడతారని నారాయణే చెప్పాడు. "ఛీ తురకాడింట్లో కుక్క విలువ చేయని ఈ బతుకెందుకండీ" అంటూ రేపటి నుంచి ఆఫీసుకు రానని చెప్పి వెళ్ళి పోయేవాడు. తెల్లారేసరికి అంతదూరం నుంచీ ఆ డొక్కు సైకిలును ఈడ్చుకుంటూ ఎప్పటిలాగే రొప్పుతూ ఆఫీసుకొచ్చి ఒక నవ్వు నవ్వేవాడు. హమ్మయ్య, నారాయణ ఉద్యోగం మానేయలేదని మేమంతా ఊపిరి పీల్చుకునేవాళ్ళం.


నారాయణకు సింగిల్ నెంబర్ లాటరీలు ఆడడమంటే తెగ వ్యసనం. ఆఫీసులో ఓ మూల కూర్చుని ఏవో అంకెలతో గారడీలు చేసి అందులోంచి వచ్చిన నెంబరు మీద పందాలు కాసేవాడు. దాదాపు ప్రతిరోజూ ఆడేవాడు. అతని లెక్కల్లో ఏదన్నా గొప్పతనం వుందో లేక అదృష్టం కొంత ఎక్కువ మోతాదులోనే నారాయణను కరుణించేదో తెలియదు కానీ, బాగా డబ్బులొచ్చేవి. ఈ విషయాలు ఆఫీసులో ఎవరికీ చెప్పొద్దని, జిలానీకి తెలిస్తే జీతం పెంచడని నేను హెచ్చరించినా అతని నోరు ఊరుకునేది కాదు. ఏ రోజు ఎంత వచ్చిందీ

ఉత్సాహంగా అందరికీ చెప్పేవాడు.

ఓ రోజు జిలానీకి ఈ లాటరీల విషయం తెలిసి నారాయణను తన గదిలోకి పిలిచాడు. ఇంకేముంది, నారాయణకు లెఫ్ట్ అండ్ రైట్ తప్పదని అందరూ అనుకున్నారు. నారాయణ మాత్రం ముసిముసిగా నవ్వుకుంటూ బయటకొచ్చాడు. అందరివైపు సైగచేస్తున్నట్టు చేతులూపి రివ్వున బయటకు వెళ్ళిపోయాడు. ఓ అరగంట తర్వాత తిరిగొచ్చి నేరుగా బాస్ గదిలోకే వెళ్లాడు. బయటకొచ్చాక అసలు విషయం అందరికీ చెప్పేశాడు. జిలానీ తాను సింగిల్ నెంబర్ లాటరీ ఆడే విధానం గురించి, తన జాక్‌పాట్ రహస్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడని చెప్పాడు. అంతటితో ఊరుకోకుండా ఐదు వందలిచ్చి మూడో కంటికి తెలియకుండా నారాయణ ఏ నెంబరుపై పందెం కాస్తాడో అదే నెంబరుపై తనకూ కాయమని పురమాయించాడు.

జిలానీ మీద కసి తీర్చుకోడానికి దొరికిన ఈ అరుదైన అవకాశాన్ని నారాయణ జారవిడచదల్చుకోలేదు. తనో నెంబరు మీద పందెం కాసి, జిలానీకి మరో నెంబరు టిక్కెట్లు కొని తీసుకొచ్చాడు. ఫలితం ఎప్పటిలాగే నారాయణ పక్షానే నిలిచింది. జిలానీ ఐదొందలు గుట్టుచప్పుడు కాకుండా గంగలో కలిసిపోయాయి. చివరికి ఈ విషయం జిలానీకి తెలిసి నారాయణను రహస్యంగా తన గదిలో బండ బూతులు తిట్టాడు. ఒక నెల జీతం కోత పెడతానని బెదిరించాడు. తన ఐదొందల సంగతి అందరికీ తెలుస్తుందని ఆ పని మాత్రం చేయలేదు.

ఇంతలో ఫోటోగ్రఫీ మీద మోజుతో నేను జిలానీ ఆఫీసు నుంచి వెళ్ళిపోయాను. అప్పుడప్పుడు ఫోన్ చేస్తుండమని నారాయణ నన్ను కోరాడు. మొదట్లో ఒకటి రెండుసార్లు ఫోన్‌లో పలకరించడం మినహా ఆ తర్వాత నారాయణతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.



మళ్ళీ ఏడాదిన్నర తర్వాత కనకదుర్గ గుడిలోనే కలుసుకోవడం.

కొత్తగా కొన్న నా ఎస్సెల్లార్ కెమెరా పనితనాన్ని పరీక్షించుకోడానికి, బెజవాడ అందాలను అందులో బంధించేందుకు ఓ రోజు ఉదయాన్నే బయల్దేరాను. కనకదుర్గ కొండమీద నుంచి ప్రకాశం బ్యారేజిని, వంతెనకు అటు వైపు లంకల్నీ ఫోటోలు తీద్దామని పైకి వెళ్లాను. గుళ్ళు, గోపురాలు తిరిగే అలవాటు లేకపోయినా కాకతాళీయంగా కనకదుర్గమ్మ గుడి లోపలకు కూడా వెళ్ళాను. ఇంతలో, "రమేష్ గారూ" అంటూ బిగ్గరగా కేకపెట్టి ఎవరో నన్ను గట్టిగా వాటేసుకున్నారు. కంగారుపడి తిరిగి చూసిన నాకు నోట మాట రాలేదు. కొన్ని క్షణాలు ఆ మనిషిని పోల్చుకోలేకపోయాను. ఆ అవతారం నాకు అవకాశం ఇవ్వలేదు కూడా. "నేను సార్! నారాయణ" అంటూ అదే ఆప్యాయతతో మెలికలు తిరిగాడు నారాయణ. గట్టిగా చేతులు పట్టుకున్నాను. "నారాయణా ఏమిటీ అవతారం" అని తక్షణం తేల్చుకోవాల్సిన నా సందేహాన్ని వ్యక్తం చేశాను. "రండి చెబుతా" అంటూ ఓ మూల మీదవున్న అరుగు దగ్గరకు లాక్కెళ్ళి కూర్చోపెట్టాడు.

నేను జిలానీ ఆఫీసులో మానేశాక చాలా పరిణామాలు జరిగాయని చెప్పుకొచ్చాడు నారాయణ. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు సంబంధించి మరో పత్రికను ప్రారంభించిన జిలానీ బాగా సంపాదించాడని, ఆఫీసు సిబ్బంది కూడా రెట్టింపయ్యారని చెప్పాడు. ఆఫీసు దగ్గర పెట్టిన జిలానీ మోటర్ సైకిల్ ఎవరో దొంగిలిస్తే ఆ నేరాన్ని తన మీదకు నెట్టడానికి ప్రయత్నించాడని, చివరకు రెండు రోజుల పాటు పోలీసు స్టేషన్‌లో కూడా పెట్టించాడని కన్నీళ్ళను దిగమింగుకుంటూ చెప్పాడు. వెంటనే గొంతు సవరించుకుని జిలానీని ఒక పెద్ద బండ బూతుతో శపించి ఊరుకున్నాడు. తర్వాత నా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. మళ్ళీ కలుసుకోగలిగినందుకు ఆనందంగా వుందని ముఖం నిండా నవ్వు నింపుకుని మరొకసారి నన్ను గట్టిగా వాటేసుకున్నాడు.

> *జిలానీ దగ్గర ఉద్యోగం పోయాక నానా అవస్థలు పడ్డ తనను కనకదుర్గమ్మ తల్లి కరుణించిందన్నాడు నారాయణ. గుడిలో కాస్త పలుకుబడి కలిగిన తన మేనమామ దయతో అక్కడే పూజారి కొలువిప్పించాడని, రోజుకు కనీసం రెండొందలైనా సంపాదించుకోగలుగుతున్నానంటూ కొంటెగా తన పంచె మడతల్లో దాచి వుంచిన పది రూపాయల నోట్లను నాకు చూపించాడు*

జిలానీ దగ్గర ఉద్యోగం పోయాక నానా అవస్థలు పడ్డ తనను కనకదుర్గమ్మ తల్లి కరుణించిందన్నాడు నారాయణ. గుడిలో కాస్త పలుకుబడి కలిగిన తన మేనమామ దయతో అక్కడే పూజారి కొలువిప్పించాడని, రోజుకు కనీసం రెండొందలైనా సంపాదించుకోగలుగుతున్నానంటూ కొంటెగా తన పంచె మడతల్లో దాచి వుంచిన పది రూపాయల నోట్లను నాకు చూపించాడు. తనకంటే వయస్సులో పదేళ్ళు పెద్దవాడైన మరో పూజారిని పిలిచి తన గురువుగా నాకు పరిచయం చేశాడు. ఆయనతో కలిపి తనకు ఫోటోలు తీయమని కోరితే అలాగే చేశాను.

ఇంతలో పరీక్షలకు వెళ్లే కాలేజీ అమ్మాయిలు వచ్చారు. "కన్నె పిల్లలొచ్చారు. అర్చన చేయాలి. అప్పుడప్పుడూ వస్తూ వుండండి" అంటూ నా వైపు ఓరగా చూసి కన్ను గీటి చేయి మీద బలంగా నొక్కి ముందుకు కదిలాడు నారాయణ. ●

## మూసకు భిన్నంగా అఫ్తాబ్

మూసపాత్రలకు భిన్నంగా ప్రతిపాత్రలోనూ నటించాలని అఫ్తాబ్ శివదాసాని భావిస్తున్నారు. తను కసూర్‌లో యాంటీ



హీరోగా చేయటం వల్ల ప్రస్తుతం ఉన్న పేరుకూడా పోతుందని అభిమానులు చెప్పారని ఆయన అన్నారు. 'నటనకు హీరోపాత్రే కావాల్సిన అవసరం లేదన్న పాలసీతో ఈ పాత్రను ఒప్పుకున్నాను. దానికి తగ్గట్టుగానే కసూర్ మంచి సినిమాగా ముద్రవేసుకుంది' అన్నారు. ఇప్పుడు "ప్యాసా" అనే సినిమాలో యాంగ్రీయంగ్‌మేన్‌గా నటిస్తున్నాడు. విలక్షణ నటునిగా నిలవాలన్నది తన ప్రయత్నంగా అఫ్తాబ్ చెప్పారు.

